
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 27 మే 2025




మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఎదుగుతున్న శక్తి.. భారతీయ సంస్కృతి

వేదాలు, ఉపనిషత్తులతో కూడిన సమ్మేళనం

దేశ నలుమూలల్లో ఆధ్యాత్మికత ప్రతిధ్వని

హోజాగిరి ప్రదర్శన గవర్నర్‌గా నాకు గర్వకారణం


స్పిక్ మైకే కార్యక్రమాల్లో మమేకమ్వండి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు

ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ కళా వేడుక

నాదస్వర బృంద గానం




జ్యోతి ప్రజ్వలన చేసి స్పిక్ మైకే వేడుకను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కంది, మే 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సాంస్కృతిక విలువలతో ఎదుగుతున్న శక్తివంతమైన ఉద్యమమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన స్పిక్ మైకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ట్ యూత్) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అధికారులు, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మన దేశం వేదాలు, ఉపనిషత్తులతో కూడిన సమ్మేళనమని కొనియాడారు. దేశ నలుమూల ఆధ్యాత్మికత ప్రతిధ్వనిస్తుందని పేర్కొన్నారు. స్పిక్ మైకే ఉద్యమం సంస్కృతిని-జాతి ఆత్మను ఒక సామూహిక చైతన్యంగా తీసుకువస్తుందన్నారు. పురాతన ఆలోచనాపరులు, తత్వవేత్తలను మిగతా 7వ పేజీలో

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

సెర్ప్ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఎట్టకేలకు ఉద్యోగుల నిరీక్షణకు తెర

ప్రత్యేక జీవో జారీ చేసిన సర్కార్

మార్గదర్శకాల కోసం ఎదురుచూపు

నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశం

మెదక్ అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర సర్కార్ శుభవార్త అందించింది. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న సెర్ప్(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో పదేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. ఇతర జిల్లాల్లో పని చేసే వారు సొంత జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి కానుంది. బదిలీల ప్రక్రియ పూర్తయితే జిల్లా వ్యాప్తంగా సెర్ప్ విభాగంలో అన్ని కేడర్లలలో కొత్త ఉద్యోగులు చేరనున్నారు. మెదక్ జిల్లాలో మొత్తం 132 మంది వివిధ కేడర్లలో సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు.

ఎట్టకేలకు..

సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు చివరిసారిగా 2018లో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ బదిలీల ప్రక్రియ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు చేపట్టింది. అయితే, తమకు కూడా బదిలీ అవుతుందని ఉద్యోగులు ఆశించారు. డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు కూడా చేపట్టారు. అయితే, ప్రభుత్వం వారి బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. అప్పటి నుంచి వారు మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. వారి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీలకు అనుమతిస్తూ... ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలు అందిన వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఒకేచోట పని చేసిన ఉద్యోగులకు స్థానచలనం కలగనుండగా... ఇతర జిల్లాలో పని చేసేవారు మిగతా 8వ పేజీలో



ఉద్యోగుల వివరాలు..

అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఒకరు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు ఐదుగురు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు 25 మంది, క్లస్టర్ కోఆర్డినేటర్లు 92, అడ్మిన్ అసిస్టెంట్లు ముగ్గురు, అటెండర్లు ఐదుగురు, డ్రైవర్ ఒకరు

ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం



కాంగ్రెస్ ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు ముందుకు రావడం శుభపరిణామం. ఉద్యోగులు పదేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన చాలా మంది సిబ్బంది ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం ఇవ్వనుండడంతో దాదాపుగా అందరికీ స్థానచలనం కలుగుతుందని భావిస్తున్నాం.

- తమ్మలి దత్తాత్రేయ, ఐకేపీ సంఘం జిల్లా అధ్యక్షుడు

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



సెర్ప్ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. ఇంకా మార్గరద్శకాలు రావాల్సి ఉంది. అవి వచ్చిన తర్వాతే వాటి ఆధారంగా బదిలీల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా చేపడుతాం.

- శ్రీనివాసరావు, డీఆర్డీవో పీడీ

హెల్త్ సబ్ సెంటర్లకు గ్రహణం

సంగారెడ్డి జిల్లాలో మూడేళ్లుగా ముందుకు సాగని వైనం

సంగారెడ్డి జిల్లాలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాలకు గ్రహణం పట్టుకుంది. సొంత భవనాలు నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలను కేటాయించారు. ఈ నిధులు సరిపోకపోవడంతో మూడేళ్లుగా ఎక్కడివక్కడే పనులు నిలిచిపోయాయి. ఫలితంగా అరకొర వసతుల మధ్య చాలా చోట్ల సబ్ సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మంజూరు 124.. పూర్తయినవి 35

ఒక్కో కేంద్రానికి రూ. 20 లక్షలు

నిధులు సరిపోక నిర్మించేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు

మరో రూ. 6 లక్షలు ఇస్తేనే కదలిక

సంగారెడ్డి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను(సబ్ సెంటర్-పల్లెదవాఖానా-హెల్త్ వెల్‌నెస్ సెంటర్) నెలకొల్పింది. ఒక్కో సబ్ సెంటర్ భవనాన్ని పూర్తి చేయాలంటే కనీసం రూ.26 లక్షల నిధులు అవసరపడుతాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి, సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సైతం ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. కానీ ఇప్పటి వరకు నిధుల పెంపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల వ్యయాన్ని పెంచితే తప్పా కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనిచేసి భవనాలు అప్పగించే పరిస్థితి లేదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

124 పక్కా భవనాలు మంజూరు

సంగారెడ్డి జిల్లాలో 246 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో 124 కేంద్రాలకు పక్కా భవనాలను మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ 2022 మే 31న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా 124 ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తూ అప్పటి కలెక్టర్ అదే ఏడాది జూలై 10న పాలన అనుమతులను మంజూరు చేశారు. అంతేగాక, అదే రోజున ఈ భవనాల నిర్మాణాలను వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు కేటాయించారు. ఇందులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 81 ఆరోగ్య ఉప కేంద్రాలు, టీజీఎంఎస్ఐడీసీకి 43 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు.


ఫసల్‌వాదిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిన హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం

అసంపూర్తి దశలోనే..

జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసిందే తప్ప చేసిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో కొన్ని భవన నిర్మాణ పనులు ముందుకు సాగకపోగా, మరికొన్ని పనులు మధ్యలోనే అర్థాంతరంగా నిలిచిపోయాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించిన 81 ఆరోగ్య ఉప కేంద్రాలలో ఇప్పటి వరకు 43 కేంద్రాల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 18 కేంద్రాలు నిర్మాణ దశలో ఉండగా, 28 కేంద్రాల పనులు ఇతరత్ర కారణాలతో ఇంకా ప్రారంభించనేలేదు. ఇక టీజీఎంఎస్ఐడీసీ ఏజెన్సీకి కేటాయించిన 43 ఆరోగ్య ఉప కేంద్రాలలో ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. వాస్తవానికి టీజీఎంఎస్ఐడీసీకి కేటాయించిన 43 కేంద్రాల్లో 34 కేంద్రాల నిర్మాణ బాధ్యతలను డీఆర్‌డీఏకు అప్పగించారు. ఆ తర్వాత పర్యవేక్షణ బాధ్యతలను టీజీఎంఎస్ఐడీసీకి ఇచ్చారు. అయితే, డీఆర్‌డీఏకు కేటాయించిన 34 ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పట్లో అప్పగించారు. ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున సంఘాలకు అడ్వాన్స్‌గా అప్పటి కలెక్టర్ విడుదల చేశారు. అయినా మిగిలిన డబ్బు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని, నిర్మాణాలను మొదలుపెట్టేందుకు ముందుకు రావడం లేదు.

ఎన్‌హెచ్ఎం నిధులు వెనక్కి?

హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలకు సంబంధించి నిధులను 15వ ఆర్థిక సంఘం, జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం) ద్వారా మంజూరు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సబ్ సెంటర్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఈ మధ్యనే ఎన్‌హెచ్ఎం నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతి ఈ పరిస్థితి ఉండడం గమనార్హం.

బడి బాటకు కార్యాచరణ

షెడ్యూల్ ఖరారు చేసిన విద్యాశాఖ

జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహణ

బడుల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా ప్రణాళిక



సంగారెడ్డి అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా 2025-25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్నది. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నోట్‌బుక్‌లు, పాఠపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. అయితే, ప్రతీ యేటా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు షెడ్యూల్‌తో పాటు మార్గదర్శకాలను జారీ చేశారు.

రోజూ వారీ షెడ్యూల్ ఇలా

- జూన్ 6వ తేదీన స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ గ్రామసభ నిర్వహించాలి.
- 7న టీచర్లు ప్రతీ ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాలి.
- 8 నుంచి 10వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు ప్రత్యేకావసరాలున్న పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి.
- 11న కార్యక్రమాలపై సమీక్షించుకోవాలి.
- 12న పాఠశాలల అలంకరణ, పండుగ వాతావరణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వాగతం పలకాలి. పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం)నిర్వహించాలి. అమ్మ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లు, యూనిఫామ్ అందించాలి.
- 13న ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహించాలి.
- 16న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(లిప్)దినోత్సవం జరపాలి. అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలి. పిల్లలు రూపొందించిన వివిధ ఛార్టులతో గదులను అలంకరించాలి. చదవడం, గణిత సంబంధిత అంశాలపై ఎఫ్ఎల్ఎన్ క్విజ్ పోటీలు నిర్వహించాలి.
- 17న సమీకృత విద్య, బాలికా విద్యాదినోత్సవం నిర్వహించాలి. బాలికా వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి.
- 18న తల్లిదండ్రులను, గ్రామస్థులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలీకరణ, ఇతర ఆధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి.
- 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలి.

సమష్టి కృషితోనే సఫలం

బడిబాట ఏటా నిర్వహించే కార్యక్రమమే అయినా, కొన్ని పాఠశాలలు మాత్రమే చిత్తశుద్ధితో నిర్వహిస్తూ ఇతర యాజమాన్యాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది అత్యధిక ప్రవేశాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఇటీవల శిక్షణలో ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు దిశానిర్దేశం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈవోలకే ఈ కార్యక్రమం పరిమితం కాకుండా మండలానికో జిల్లా అధికారులను నియమించడం, అంతేకాకుండా స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు, అమ్మ ఆదర్శ కమిటీలు, పూర్వ విద్యార్థులు బడిబాట పట్టేలా చర్యలు తీసుకోవాలి. బడిబాట సఫలం కావాలంటే సమష్టి కృషి ఎంతైనా అవసరం ఉన్నది.

చిట్టితల్లి ఎవరో..?

పది రోజుల క్రితం ఆస్పత్రి ఆవరణలో లభ్యం

మహిళ వదిలేసి వెళ్లినట్లు సీసీ ఫుటేజీ


ఆస్పత్రి ఆవరణలో చిన్నారిని వదిలేసి వెళ్లిన మహిళ సీసీ ఫుటేజీ

సంగారెడ్డి క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారి ఎవరు అన్న విషయాన్ని తేల్చేపనిలో పడ్డారు పోలీసులు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుప్రతిలోని ఎంసీహెచ్ విభాగం వద్ద వాహనాలు పార్కింగ్ చేసే చోట ఈనెల 17న 20 రోజుల ఆడ శిశువు లభించిన విషయం తెలిసిందే. సదరు శిశువును అదేరోజు ఆసుపత్రిలో చికిత్స అందజేసి అధికారులు శిశుగృహకు తరలించారు. ప్రస్తుతం పసిపాప పూర్తిగా ఆరోగ్యంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే, అధికారుల ఫిర్యాదుతో సంగారెడ్డి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పసిపాపను గుర్తు తెలియని మహిళ వదిలేసి వెళ్లినట్లు ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. సదరు మహిళ తన ముఖానికి ముసుగు వేసుకొని ఉంది. పాపను వదిలేసిన అనంతరం సదరు మహిళ పట్టణంలోని కొత్తబస్టాండ్‌కు చేరుకొని హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వెళ్లిపోయినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. అయితే ఈ శిశువును వదిలేసింది పాప తల్లేనా? లేక బంధువులా? లేక మరెక్కడి నుంచైనా ఎత్తుకొచ్చి ఇక్కడ వదిలేసిందా? అనే విషయాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన అనుమానాస్పద మహిళ దొరికితే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యే అవకాశముందని పట్టణ సిఐ రమేష్ తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం పాస్ పుస్తకాలతో క్యూ

- అధికారులను నిలదీసిన రైతులు 7

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి 6

నీటి తండ్లాట





మాసాయిపేట మండలంలోని రామంతపూర్ తండాలో నెలరోజులుగా మిషన్ భగీరథ తాగునీరు సరిపోను సరఫరా కాకపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో బోర్లు ఉన్నప్పటికీ మోటార్లు కాలిపోయాయి. రిపేరు చేయించడానికి నిధులు లేక గ్రామ కార్యదర్శి చేతులెత్తేశారు. ఇక చేసేదేమీ లేక ఇంటిల్లిపాది సమీపంలో ఉన్న పొలాలకు వద్దకు వెళ్లి బోర్ల నుంచి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుంది. నీళ్ల కోసం వెళుతున్న పిల్లలు స్కూళ్లకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ ఇంజనీర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని మండిపడుతున్నారు.

- మాసాయిపేట, మే 26(ఆంధ్రజ్యోతి)

19 ప్యాకెట్ల గంజాయి పట్టివేత

● ఇద్దరు యువకుల అరెస్ట్

రామచంద్రాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన మహ్మద్ కరీం(28), మహ్మద్ ఇర్షద్(27)లకు ఆరునెలల క్రితం కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఫేజ్-2లో ఇళ్లు రావడంతో ఇక్కడికి మకాం మార్చారు. వీరికి మహారాష్ట్రలో గంజాయి సరఫరా చేస్తున్న వసీం, అంజద్ పరిచయమయ్యారు. వారి వద్ద నుంచి ప్రతినెలా 42 ప్యాకెట్లు కొని విక్రయిస్తున్నారు. ఒక ప్యాకెట్‌ను రూ.100కు కొని, రూ.500లకు విక్రయిస్తున్నారు. శనివారం మహారాష్ట్రలో 42 ప్యాకెట్లు కొని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన వీరు 20 ప్యాకెట్లను బోరబండలో విక్రయించారు. మిగిలినవి కొల్లూరు డబుల్ బెడ్‌రూంకు తీసుకొచ్చి.. ఆదివారం విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐలు రవీందర్, రమేశ్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. 19 ప్యాకెట్లలో 111 గ్రాముల గంజాయిని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. కంది మండలం చిద్రుప్ప, బేగంపేట గ్రామాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బేగంపేట గ్రామానికి చెందిన జంగారి సాయిగౌడ్ ఫిర్యాదు చేశారు. కంది మండలం జుల్కల్ గ్రామానికి చెందిన శైలజ తనకు సంబంధించిన 0.39 గుంటల భూమిని ధరణిలో మిస్సింగ్‌లో పడిందని, తన భూమి ఇప్పించి న్యాయం చేయాలని అర్జీలో కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. భూ భారతిలో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డిలోని మహిళా సమైఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన సర్వేయర్ల శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ దినేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో 52 అర్జీలు

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 52 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలు 19, పింఛన్లు 3, డబుల్ బెడ్ రూం ఇళ్లు 1, ఇతర సమస్యలపై 29 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్పీ

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ

● బాధితులకు అప్పగించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవకాలంలో దొంగతనానికి గురైన 35 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని బాధితులకు సోమవారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చని, ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. సెల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, పట్టణ సీఐ నాగరాజు, ఎస్‌ఐ అమర్, ఐటీకోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్మికుడు మృతి

● వర్గల్ మండలం గౌరారం వద్ద ఘటన


కావమోద్దీన్‌రాయ్ మృతదేహం

వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం వద్ద సోమవారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కీర్తిరాజ్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కావమోద్దీన్ రాయ్(41) అనే కార్మికుడు తన తోటి కార్మికులు మనోజ్ మహతో, మనోజ్‌కుమార్, రాజ్‌కుమార్, రాంబాబు రాయ్‌తో కలిసి గౌరారం గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. వీరంతా సూరజ్ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా మార్స్ ఇండియా పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ నిద్రపోయారు. సోమవారం ఉదయం కావమోద్దీన్ రాయ్ నిద్ర నుంచి లేవకపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు వచ్చి మృతిచెందాడని సూరజ్ కన్‌స్ట్రక్షన్ హెచ్‌ఆర్, అడ్మిన్ దాసరి ప్రమోద్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో చోరీ


సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు

తూప్రాన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఆలయంలోని హుండీలో నగదు చోరీ చేశారు. ఈ విషయమై ఆలయ ఫౌండర్ అమిరిశెట్టి సతీష్‌గుప్తా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన మహ్మద్ జహంగీర్ చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు వివరించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు అయ్యాయని వివరించారు.

రుక్మాపూర్‌లో మహిళ హత్య


హత్యకు గురైన రాణమ్మ

న్యాల్‌కల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. హద్నూర్ పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాణెమ్మ(46)ను గుర్తు తెలియని దుండగులు గొంతు నులిమి హత్యచేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, రూరల్ సీఐ జక్కుల హన్మంతులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి
- మరొకరికి గాయాలు
- రామాయంపేట జంక్షన్ వద్ద ఘటన


నిఖిల్(ఫైల్)

రామాయంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందగా.. మరొకిరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రామాయంపేట జంక్షన్ వద్ద సోమవారం చోటు చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి ప్రాంతానికి చెందిన నిఖిల్(24) తన స్నేహితుడు నితీష్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ రామాయంపేట వైపు క్రాస్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టింది. నిఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా.. నితీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలాజీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కుమార్ మృతదేహం

చేగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన ధర్పల్లి కుమార్(54) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 5న చేగుంట మండలం అనంతసాగర్‌లోని అత్తమామల చూడడానికి వచ్చాడు. అదేరోజు రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఉల్లితిమ్మాయిపల్లి గ్రామ శివారులోని కమాన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. ఆదివారం రాత్రి మృతిచెందాడు. భార్య ధర్పల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

దుబ్బాక, మే 26 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామం వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు పోతరెడ్డిపేట గ్రామంలోని డబుల్ బెడ్‌రూం కాలనీ నుంచి గ్రామంలోకి బైక్‌పై వస్తున్న మణికంఠ, స్వామి, రాజును ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా.. సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

● తప్పిన ప్రమాదం


బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన సంఘటన వర్గల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చోటు చేసుకున్నది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్గల్‌లో బ్యాంకు ఆఫ్ బరోడా వద్ద ప్రారంభమైన రోడ్డు నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు వర్షాల కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఆర్అండ్‌బీ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా కొద్దిపాటి వర్షానికే పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కొట్టంలో నుంచి గొర్రెలు మాయం

శివ్వంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కొట్టంలోంచి ఐదు గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన సంఘటన సోమవారం శివ్వంపేటలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటలో ఈసుగారి రాజయ్య ఆదివారం రాత్రి గొర్రెల మందను కొట్టంలో తోలి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఐదు గొర్రెలు చోరీ కావడంతో రాజయ్య కొడుకు మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్ తెలిపారు.





సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు (ఫైల్)

కొత్త కోర్సులతో ఉపాధికి ఊతం

సిద్దిపేట డిగ్రీ కళాశాలలో స్పెషల్ కోర్సులు

- ప్రత్యేకత చాటితేనే ఉపాధి అవకాశాలు
- సద్వినియోగం చేసుకోవాలని సూచనలు

సిద్దిపేట కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో ప్రత్యేకత చాటితేనే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. విద్యార్థి దశ నుంచే చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే సక్సెస్ అవుతారు. కొత్త అకడమిక్ ఇయర్ మొదలవుతుంది. మా కాలేజీలో చేరండి. ఈ కోర్సు తీసుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు ఆఫర్స్ చేస్తుంటారు. అయితే కోర్సును ఎంపిక చేసుకునే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. పక్కవాళ్లు చెప్పారనో.. స్నేహితుడు సలహా ఇచ్చాడనో ఏదో ఒక కోర్సులో చేరితే ఇబ్బందులు వస్తాయి. అనుకున్నది సాధించలేక వెనకబడిపోతాం. అలా కాకుండా ఆచీతూచి వ్యవహరించి ముందడుగు వేయాలి. అనుభవం కలిగిన వారి సలహాలు తీసుకోవాలి. కళాశాల గురించి పూర్తిగా తెలుసుకోవాలి. కోర్సు పూర్తయ్యాక ఉన్న అవకాశాల గురించి ఆరా తీయాలి. అయితే పాత కోర్సులను కాకుండా కొత్త కోర్సులు, ప్రత్యేకమైన కోర్సులను తీసుకుంటే త్వరగా ఉపాధి అవకాశాలు అందుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

ప్రత్యేక కోర్సులు

ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్లు దోస్త్ ద్వారా పూర్తవుతున్నాయి. విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టును బకెట్ సిస్టమ్ ద్వారా సెలెక్ట్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు ప్రత్యేకమైన, కొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2025- 26 విద్యా సంవత్సరానికిగానూ కొత్త కోర్సు అందుబాటులోకి వచ్చింది. బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అనే కోర్సును కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీస్ విభాగం రూపొందించింది. జిల్లాలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో మాత్రమే ఈ కోర్సు అందుబాటులో ఉంది. మూడేళ్ల ఈ కోర్సులో ఫైనల్ ఇయర్‌లో అప్రెంటీస్‌షిప్ విధానం అమలుకానున్నది. విద్యార్థులకు ప్రతినెల భృతి రూపంలో రూ.9 వేలు అందివ్వనున్నారు. ఆస్పత్రి, ఆస్పత్రి అనుబంధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఈ కోర్సు ద్వారా పొందవచ్చని చెబుతున్నారు. అలాగే బీఏ హెచ్‌ఈపీ స్పెషల్ కోర్సును గతేడాది ప్రారంభించారు. డిగ్రీ పూర్తయ్యాక సివిల్స్ చేయాలనే లక్ష్యం ఉన్నవాళ్లకు ఇది మంచి కోర్సు అని నిపుణులు చెబుతున్నారు. సివిల్స్ ప్రిపేర్ కావాలనుకునే వారికి మెటీరియల్‌పరంగా లోతైన విషయ పరిజ్ఞానం పొందవచ్చంటున్నారు. బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సు అందుబాటులో ఉంది. అయితే మూడేళ్ల డిగ్రీ కాదు. ఇంజనీరింగ్, ఫార్మసీ మాదిరిగా కోర్సు వ్యవధి నాలుగేళ్లు ఉంటుంది. ఈ కోర్సు చేసిన వారు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇవే కాకుండా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, పబ్లిక్ పాలసీస్ అండ్ గవర్నెన్స్, బీకాం ఫైనాన్స్, బీబీఏ వంటి ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఫిషరీస్ కోర్సు ప్రత్యేకం. డిగ్రీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు చదివిన వారు మంచి ఉపాధిని పొందుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు. ఈ ప్రత్యేకమైన కోర్సులు, స్పెషల్ డిగ్రీల భవితవ్యం, ఉపాధి అవకాశాల గురించి వివరాలను తెలుసుకోవడానికి కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. సహాయక కేంద్రాన్ని సందర్శించి మీకు తగిన కోర్సును తీసుకోవాలని కళాశాల అధ్యాపకులు సూచిస్తున్నారు.

మన చదువు ఉపాధినిచ్చేదిగా ఉండాలి



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవం కలిగిన, అర్హత కలిగిన అధ్యాపక బృందం ఉన్నారు. స్వయం ప్రతిపత్తి, ఐఎస్‌వో గుర్తింపు కలిగిన కళాశాల. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సెలెక్ట్ చేసుకోవాలని సూచిస్తున్నాను. అలాగే కళాశాలలో ప్రత్యేకమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ సంవత్సరం కొత్తగా బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మేంట్ అందుబాటులోకి వచ్చింది. అలాగే ఫిషరీస్ కోర్సు కళాశాల ప్రత్యేకం. ఇలాంటి మరిన్ని ఉపాధినిచ్చే కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి వివరాలు పొందవచ్చు. కోర్సు సెలెక్ట్ చేసుకునేముందు జాగ్రత్తలు తీసుకోవాలి. మనం చదివే చదువు మనకు ఉపాధిని అందించేదిగా ఉండాలి. విద్యార్థుల అభిరుచికి తగినట్టుగా ఎంచుకోవాలి.

డా. జి.సునీత,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



ఐఐటీహెచ్‌లో స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సును హాజరైన కళాకారులు

ఎదుగుతున్న శక్తి.. భారతీయ సంస్కృతి

5వ పేజీ తరువాయి

మన దేశం కలిగిఉండడం గర్వకారణమన్నారు. దేశ నలుమూలల వేదాలు, ఉపనిషత్తుల జ్ఞానం ద్వారా నిర్మితమైన తాత్విక, ఆధ్యాత్మిక పునాదులను ప్రతిఫలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ధర్మం అంటే మనం ఆలోచించే విధానమని, మతం అంటే మనం పూజించే విధానమని గవర్నర్ తెలిపారు. సమకాలీన చర్చలో రెండింటినీ కలపకూడదనే ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు. తన స్వస్థలమైన త్రిపుర నుంచి వచ్చిన సంప్రదాయ నృత్య రూపమైన హోజాగిరిని స్పిక్ మైకే 10వ అంతర్జాతీయ ప్రదర్శనలో ఒకటిగా చేర్చడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నర్‌గా తన పదవికాలంలో ఇది వ్యక్తిగత గర్వకారణంగా నిలుస్తుందన్నారు. హిందూస్థానీ సంగీతం ఒకప్పుడు త్రిపురలో దాని మహారాజుల పాలనలో వర్ధిల్లిందన్నారు. ఇప్పుడు స్పిక్ మైకే ప్రయత్నాల ద్వారా పునరుజ్జీవనాన్ని పొందుతుందని ఆకాంక్షించారు. ఢిల్లీ, ఖరగ్‌పూర్, నాగ్‌పూర్‌లలో జరిగిన మునుపటి అంతర్జాతీయ సమావేశాలకు గౌరవ అతిథిగా హాజరైన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. స్పిక్ మైకే సదస్సుకు హాజరైన ప్రతీ ఒక్కరూ ఈ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమంలో మమేకమవ్వాలని పేర్కొన్నారు.

అలరించిన కళా ప్రదర్శనలు.. ఉట్టిపడిన సంప్రదాయం

పద్మవిభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, పద్మ భూషణ్ డాక్టర్ రాజంతోపాటు 200మంది సంగీత ప్రముఖులు హాజరయ్యారు. తొలుత రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వం వహించిన 'గాంధీ' చిత్రం ప్రదర్శించారు. తర్వాత చలనచిత్ర నిపుణుడితో చర్చ జరిగింది. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు విద్వాన్ షేక్ మహబూబ్ సుభానీ, కలీషాబీ మహబూబ్ నాదస్వర బృంద తమ ప్రదర్శనతో అందరిని మైమరిపించారు. పద్మ భూషణ్ అవార్డు గ్రహీతలు రాజా-రాధారెడ్డి కూచిపూడి నృత్యం అలరించింది. పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డా.ఎన్. రాజం హిందుస్తానీ వయొలిన్ వాయిద్యం కట్టిపడేసింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, పండితులు, సంగీత విద్వాంసులు, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, బ్రహ్మ కుమారీస్ సభ్యులు, భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి అలరించారు. దేశ సంస్కృతిని గుర్తుచేసేలా చీరలు, లాల్చీ పైజామాలు వేసుకుని కార్యక్రమానికి హాజరయ్యారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్‌తో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులను చేనేత వస్త్రాలతో సత్కరించి, స్వదేశీ జ్ఞాపికలను అందజేశారు. స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సుతో ఐఐటీహెచ్‌లో వారం రోజులపాటు సందడి నెలకొననున్నది. భరతనాట్యం, కథక్, నాదస్వరం, కూచిపూడి, కర్ణాటక వయోలిన్, హిందుస్తానీ గాత్రం, తబలా, రుద్ర వీణ, కూడియాట్టం, ధృపద్, హిందుస్థానీ వయోలిన్, గోండుల గుస్సాడి నృత్యం, హోజాగిరి నృత్యం, కర్ణాటక వయోలిన్, హిందుస్తానీ గానం, పురూలియా చౌ, హజూరి రాగి-షాబాద్ కీర్తన, పంగ్ చోలోమ్, ఒడిస్సీ, సితార్, సరోద్, ఖవ్వాలి, పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం, బ్రహ్మ కుమారీల ధ్యానం- రాజ్ యోగ, నిజాంకాలంలో కళల జీవనశైలి, సంస్కృతీ, దౌత్యం వంటి వివిధ భారతీయ కళలపై ప్రముఖ సాహితీవేత్తలు, అవార్డు గ్రహీతలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.



రాయపోల్‌లో విత్తనాల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ బాబునాయక్

హాట్ కేకుల్లా 'పచ్చిరొట్ట' విక్రయం

- గంటల్లోనే అయిపోతున్న వైనం
- విత్తనాలు దొరక్క వెనుదిరుగుతున్న రైతులు

రాయపోల్/ములుగు/వర్గల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు పచ్చిరొట్ట విత్తనాలు నెలల తరబడి కూడా అమ్ముడు పోయేవి కావు. రానురాను రైతుల్లో చైతన్యం పెరిగింది. పొలాలను సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు విరివిగా వాడడం మొదలుపెట్టారు. మండలానికి జీలుగా విత్తనాలు 30 కిలోల బ్యాగులు 166, పెద్ద జనుము విత్తనాలు 40 కిలోల బ్యాగులు 50 వచ్చాయి. వాటి విక్రయాన్ని సోమవారం ఉదయం గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బాబునాయక్ ప్రారంభించారు. అప్పటికే రాయపోల్ రైతువేదిక వద్ద వందలాది మంది రైతులు పర్మిట్ల కోసం ఎదురుచూస్తూ ఉండడంతో రెండు గంటల వ్యవధిలోనే మొత్తం పచ్చిరొట్ట విత్తనాలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. విత్తనాలు దొరకని రైతులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ములుగు మండలం వంటిమామిడి గ్రామంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఇందులో ఇన్‌చార్జి ఏవో వసంతరావు, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుత్తాడి శ్రీనివాస్, ఏఈవో పృథ్వీ పాల్గొన్నారు. అలాగే వర్గల్ మండలంలోని అంబర్‌పేట రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శేషశయన జీలుగ విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రైతులు సదానందరెడ్డి, లక్ష్మారెడ్డి, స్వామి, రమేశ్, ఏఈవో భారతి పాల్గొన్నారు.



వర్గల్ మండలం అంబర్‌పేటలో రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏవో శేషశయన



కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



సాయన్నముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

భూస్వాముల వ్యతిరేక పోరాట యోధుడు సాయన్న

- కృష్ణస్వామి చరిత్ర చాలా గొప్పది
- తెలంగాణ వచ్చాకే ప్రముఖుల విగ్రహాలకు గుర్తింపు
- శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

నంగునూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పండగ సాయన్నముదిరాజ్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండగ సాయన్న, కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాలను మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాకే ప్రముఖుల విగ్రహాలను పెట్టుకుని గుర్తుంచుకుంటున్నామని తెలిపారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడిన కృష్ణ స్వామి, పండుగ సాయన్న లాంటి మహనీయుల విగ్రహాలను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో నలుమూలల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కృష్ణస్వామి ముదిరాజ్ చరిత్ర చాలా గొప్పదని, ఆనాటి నిజాం కాలంలోనే గుర్తింపబడ్డారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1956 తర్వాత హైదరాబాద్ మొదటి మేయర్‌గా కృష్ణస్వామి పనిచేశారని గుర్తుచేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం వరకే కాకుండా వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలు మంజూరు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ముదిరాజ్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే చెరువుల్లో చేప పిల్లలు వేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, రైతుబంధు, రైతుబీమా, ఉద్యోగుల వేతనాలు చెల్లించడం లేదు. కానీ రూ.200 కోట్లు పెట్టి అందాల పోటీలు ఎవరికి అవసరమని నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మముదిరాజ్, నగేష్, సత్యం, ముదిరాజ్ సంఘం గ్రామ నాయకులు కనకరాజు, శ్రీనివాస్, లక్ష్మయ్య, రాజు, ఆంజనేయులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో కొత్తరాతియుగం ఆనవాళ్లు

- మూడు గొడ్డళ్లు, శాతవాహన కాలంనాటి టెర్రకోట బొమ్మ
- కొత్త తెలంగాణ చరిత్ర బృందం క్షేత్ర పరిశీలనలో వెలుగుచూసిన పురాతన వస్తువులు



పాటిగడ్డ పరిసరాల్లో బయటపడ్డ చారిత్రక వస్తువులు

హైదరాబాద్ సిటీ, మే26(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కొండపాక ప్రాంతం రాష్ట్రకూటుల శిల్పాలు, కాకతీయ శాసనాలు, చారిత్రక దేవాలయాలకు పెట్టింది పేరు. అదే ప్రదేశంలోని పాటిగడ్డ పరిసరాల్లో మరికొన్ని చారిత్రక వస్తువులు కొత్త తెలంగాణ చరిత్ర బృందం క్షేత్ర పరిశీలనలో వెలుగుచూశాయని ఆ సంస్థ ప్రతినిధి అహోబిలం కరుణాకర్ తెలిపారు. కొత్తరాతియుగం నాటి మూడు గొడ్డళ్లు, శాతవాహనుల కాలానికి చెందిన టెర్రకోట బొమ్మను గుర్తించినట్లు చెప్పారు. అదే ప్రదేశంలో ఇదివరకు గుప్పిళ్ల కొద్దీ రంగురంగుల గాజు పూసలు, దంతపు పాచిక, రెండు అంచుల రాతిగొడ్డలి, టెర్రకోట బొమ్మ శకలాలు, ఇనుం చిట్టాలు లాంటి మరెన్నో పురావస్తువులు లభించాయి. తెలంగాణ హెరిటేజ్ శాఖ కొండపాక పాటిగడ్డలో ప్రత్యేక శోధన నిర్వహించాలని, తద్వారా విలువైన చారిత్రక సంపదను కాపాడాలని కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ కోరారు.

'ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి'

గజ్వేల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి... మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. మావోయిస్టుల నిర్మూలన పేరుతో చేపడుతున్న చర్యల వల్ల అడవుల సమీపంలో ఉన్న అమాయకపు ఆదివాసీ ప్రజలు చంపబడుతున్నారన్నారు. అడవుల్లో ఉన్న సహజ సిద్ధమైన వనరులను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడం కోసం చేపడుతున్న చర్య అని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నావని పేర్కొన్నారు. పెద్దఎత్తున పోలీస్ బలగాలను అడవుల్లోకి పంపి మారణహోమానికి పాల్పడుతున్నారని చెప్పారు.

'గీతం'లో ఎన్‌సీసీ క్యాంపు

పటాన్‌చెరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని 33 (తెలంగాణ) బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం సంయుక్త వార్షిక శిక్షణా శిబిరం (సీఏటీసీ-3) మే 26 నుంచి జూ 4 వరకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (రుద్రారం) ప్రాంగణంలో నిర్వహించనున్నారు. పదిరోజుల పాటు శిబిరం నిర్వహించనున్నారు. క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడం, క్రమశిక్షణ, సహకారం, వ్యక్తిత్వ నిర్మాణాలను ప్రోత్సహించడం, సామాజిక సేవ, జాతీయ ఐక్యత స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. కల్నల్ రమేష్ నేతృత్వంలో నిర్వహించే ఈ క్యాంపులో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ అకౌంట్స్ అధికారిగా కెప్టెన్ పి.విజయ, క్యాంప్ శిక్షణ అధికారిగా లెఫ్టినెంట్ ఆర్.మహేందర్ రెడ్డి, క్యాంప్ అడ్జటెంట్‌గా లెఫ్టినెంట్ యాదగిరి వ్యవహరించనున్నారు. గీతం తరఫున ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ పాల్గొననున్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

సదాశివపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే సోదరుడి అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, ఆ పార్టీ మాజీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సర్వే నెంబరు 181లోని సీలింగ్ (ప్రభుత్వ) భూమిని తన సతీమణి అరుణ పేరుపై పట్టాగా మార్చుకుని అధిక ధరలకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదాశివపేట పట్టణంలో 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న టీఎన్జీవో భవనం ఎవరి ఆధీనంలో ఉన్నదో.. వివరాలు తెలియజేయడంతో పాటు భవనంలో కొనసాగుతున్న దుకాణాలు వాటి అద్దెలు, భవనం మున్సిపల్‌కు చెల్లించాల్సిన రూ.27 లక్షల ఆస్తిపన్నుపై విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు. సదాశివపేట పట్టణంలో గురునగర్ కాలనీలో ఎమ్మెల్యే సోదరుడు చింతా గోపాల్ మున్సిపల్ రోడ్డును ఆక్రమించి, సెట్ బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ భవన నిర్మాణంలోని అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ జే.ఉమాతో పాటు రెవెన్యూ, విద్యాశాఖ అధికారులను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదులోని అక్రమాలపై నిగ్గు తేల్చి, వాటి తాలూకు నివేదికలను అందజేయాలని ఆదేశించారు.



కలెక్టర్ క్రాంతికి ఫిర్యాదు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు

పచ్చిరొట్ట విత్తనాల కోసం పాస్ పుస్తకాలతో క్యూ

- అధికారులను నిలదీసిన రైతులు



రైతులు క్యూలో ఉంచిన పట్టాదారు పాసుపుస్తకాలు

జోగిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగ) కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సరిపడా విత్తనాలు రాకపోవడంతో వాటి కోసం వేకువ జాము నుంచే క్యూలో నిలబడుతున్నారు. ఎక్కువ సేపు నిలబడలేక విత్తనాల కోసం తీసుకువచ్చిన పట్టదారుపాస్ పుస్తకాలను క్యూలో పెట్టారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. జోగిపేట వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 500 క్వింటాళ్ల జీలుగు విత్తనాలను కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మంగళవారం నుంచి వాటిని పంపిణీ చేస్తారని చెప్పడంతో ఉదయమే రైతులంతా వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్నారు. అయితే, క్యూలో నిలబడే ఓపిక లేక అందరూ తమ వెంట తెచ్చుకున్న పట్టాదారు పాస్‌పుస్తకాలను, వారి జిరాక్స్ కాపీలను క్యూలో ఉంచి నీడలో నిలబడ్డారు. సరిపడా జీలుగ విత్తనాలు కేటాయించకపోవడంతో కొందరు రైతులు అధికారులతో వాగ్వాదానికి, ఆందోళనకు దిగారు.

బాలిక కళా.. భళా

- కాశీ విశ్వనాథుని ప్రాంగణంలో నృత్య ప్రదర్శన

నర్సాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో కాశీ విశ్వనాథ ఆలయం వద్ద మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన బాలిక రక్షితగౌడ్ నృత్య ప్రదర్శన చేసి అందరినీ అలరించింది. హైదరాబాద్‌లోని భరత్ ఆర్ట్స్ అకాడమీ ట్రస్టు ఆధ్వర్యంలో కాశీకి వెళ్లిన బృందంలో నర్సాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, మాజీ మున్సిపల్ చైర్మన్ డీ.అనసూయ అశోక్‌గౌడ్ దంపతుల కూతురు రక్షితగౌడ్ కూడా ఉన్నారు. కాశీలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విశ్వనాథుని నిత్య మహోత్సవంలో భరతనాట్య సంస్కృతి కళావేదికపై కళా ప్రదర్శన చేసి అక్కడివారిని అలరించింది. దేశంలోనే పుణ్య క్షేత్రమైన కోట్లాది మంది భక్తుల ఇలవెల్పులో నర్సాపూర్ బాలిక ప్రదర్శనకు అవకాశం రావడం పట్ల ఆమె తల్లిదండ్రులు అనుసూయ,అశోక్‌గౌడ్ ఆనందానికి అవధుల్లేవు.



కాశీ విశ్వనాథుని సన్నిధిలో నృత్య ప్రదర్శనతో అలరించిన రక్షితగౌడ్

న్యూస్ బాక్స్

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి నేడు శిబిరాలు

పటాన్‌చెరు, మే 26(ఆంధ్రజ్యోతి): పీఎఫ్ సమస్యల పరిష్కారానికి పటాన్‌చెరు పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని పలు జిల్లాల్లో మంగళవారం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం ఎంఎస్ ల్యాబరేటరీస్ పరిశ్రమలో, సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి వరుణ్‌బేవరేజెస్ పరిశ్రమలో, హైదరాబాద్ శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడలోని కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థలో, జిన్నారం మండలం గడ్డపోతారం న్యూలాండ్ ఫార్మా, యూనిట్ -3లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9-35 నుంచి సాయంత్రం 5-45వరకు నిర్వహించే శిబిరానికి సరైన పత్రాలతో హాజరైతే సమస్యలను అక్కడే పరిష్కరిస్తామన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే..

సంగారెడ్డి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దశంకరంపేట, మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు పెరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా హార్టికల్చర్ ప్లాంటేషన్ మేనేజర్ శ్రావణ్ అన్నారు. సోమవారం పేట మండల పరిధిలోని గొట్టి ముక్కుల, మల్కాపూర్ గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు.

ఘనంగా 108 పైలెట్స్‌డే

మెదక్ కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): 108 పైలెట్స్ డే దినోత్సవాన్ని సోమవారం మెదక్ మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 108 వాహనాల ఎమర్జెన్సీ మేనేజింగ్ ఎగ్జిక్యూటీవ్ అనిల్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో పైలెట్స్ నవీన్, దుర్గపతి, వెంకట్, జగన్, నగేష్, ఆంజనేయులు, ఈఎంటీ జాకప్, ప్రవీణ్, రాములు మాన్య, వీణ పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

జహీరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): పవిత్రహజ్ యాత్రకు వెళ్లే అవకాశం కొందరికే వస్తుందని అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి హరీశ్‌రావుపేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణానికి చెందిన రైల్వేబోర్డు సభ్యులు షేక్‌ఫరీద్ హజ్‌యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆయనను హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల దరఖాస్తుల స్వీకరణ

తూప్రాన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాతర్‌పల్లిలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు)లో బోధించుటకు ఉపాధ్యాయ, జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలో తెలుగు, హిందీ, ఆంగ్లం, పీఈటీ, పీడీ, భౌతిక, రసాయన, జువాలజీ, జీవశాస్త్రం, గణితం తదితర సబ్జెక్టుల్లో టీజీటీ. పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోస్టులు, అధ్యాపకుల ఖాళీల్లో పార్ట్ టైం ప్రాతిపదికన పనిచేయుటకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువపత్రాలతో 28 వరకు గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. బాలికల పాఠశాల, కళాశాలలో మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, మెరిట్, డెమో ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని తెలిపారు. డెమో తరగతులు 31న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ వివరించారు.

రేపు ఆలయ భూముల కౌలుకు వేలం

తూప్రాన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలం అల్లాపూర్, యావాపూర్‌లలో ఉన్న ఆలయ భూముల కౌలుకు ఈ నెల 27న బహిరంగ వేలం పాటలునిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వర్గల్ మండలం నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి యావాపూర్‌లో, అల్లాపూర్‌లలో ఉన్న భూములకు ఏడాది కౌలుకు ఈనెల 27న మంగళవారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కౌలు పొందే రైతులు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు రూ. వెయ్యి డిపాజిట్ చేయాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



నివాస ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను అలాగే వదిలేయడం స్థానికుల భయాందోళనకు కారణమవుతోంది. ఎప్పుడు కూలుతుందోననే భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని రామ్‌నగర్ కాలనీలోని శ్రీరామాలయం వద్ద గత 30 ఏళ్ల క్రితం మంచినీటి పథకం ద్వారా ప్రజలకు వాటర్ సప్లై చేసేందుకు వాటర్ ట్యాంకును నిర్మించారు. ఆ ట్యాంకు కొంత కాలంగా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా మరో ట్యాంక్ నిర్మించి ప్రజలకు ప్రస్తుతం నీటి సరఫరా చేస్తున్నారు. అయితే శిథిలావస్థకు చేరిన ఆ వాటర్ ట్యాంక్‌ను అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. మున్సిపల్ అధికారులకు ఈ పరిస్థితి వివరించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఆ ప్రాంతంలో చరిత్ర కలిగిన రామాలయం ఉండడంతో నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. ఏ క్షణాన వాటర్ ట్యాంక్ కూలిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసి పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలని గుమ్మడిదల మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

- గుమ్మడిదల, మే 26 (ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే సొంత నిధులతో రహదారి మరమ్మతులు



ఐడీఏబొల్లారంలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు/ఐడీఏబొల్లారం/జిన్నారం, మే 26(ఆంధ్రజ్యోతి): తన సొంత నిధులతో ఇంద్రేశం, దౌల్తాబాద్ రహదారికి మరమ్మతులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం పనులు ప్రారంభమయ్యాయి. పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వరకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. పటాన్‌చెరు పట్టణ శివారులోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు నుంచి ఆర్టీవో కార్యాలయం, పెద్దవాగు బ్రిడ్జీ, బచ్చుగూడెం, రామేశ్వరంబండ చౌరస్తా, ఇంద్రేశం గ్రామంలో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన కరువైంది. వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా మారే ప్రమాదం గుర్తించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తక్షణం మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అధికారుల ప్రమేయం లేకుండా సుమారు రూ.20లక్షల సొంత డబ్బుతో ఆర్ఎంసీ వెట్ కాంక్రీట్‌తో రోడ్డుకు మరమ్మతులు ప్రారంభించారు. ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో రూ.60లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి పరిశ్రమల యజమానులు సహకారం అందించాలని కోరారు. కాగా ఐడీఏబొల్లారం పట్టణంలోని పోచమ్మ ఆలయం నిర్మాణానికి తన సహాయంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10లక్షలు అందజేశారు. జిన్నారం మండలంలోని అండూర్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వివిధ గ్రామాల నాయకులుపాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతాం



నర్సాపూర్: బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు భిక్షపతికి కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటున్న ఆవులరాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్/వెల్దుర్తి/మాసాయిపేట మే 26(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గంలో సత్తాచాటి బీఆర్ఎస్‌కు ఇక్కడ స్థానం లేకుండా చేయడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో మండలంలోని పెద్దచింతకుంట, చిన్నచింతకుంట గ్రామాల నుంచి బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీఅధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ సత్తా చూపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ఆవుల రాజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. మాసాయిపేట మండలంలోని రామంతపూర్‌కు చెందిన ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆవుల రాజిరెడ్డి ద్వారా వర్గంటి గణేష్ కుమార్, గుర్రాల దుర్గా స్వామిలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఆర్థిసాయం చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు.

వారంలోనే 'ఇందిరమ్మ' బిల్లులు

● జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్

కోహీర్, మే 26: (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారులకు వారంలోనే బిల్లులు మంజూరు చేయనున్నట్లు జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్పొరేషన్ పీడీ చలపతిరావు పలువురు లబ్ధిదారులతో కలిసి సోమవారం కోహీర్‌లోని తహసీల్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటే విడతల వారీగా వారంలోపే రూ.లక్ష చెల్లిస్తున్నట్లు తెలిపారు. బిల్లులు రావని కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను లబ్ధిదారులు నమ్మవద్దన్నారు. జిల్లావ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డీఈ మాధవరెడ్డి, ఏఈ మనస్విని, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ లబ్ధిదారులు ఉన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు



జహీరాబాద్ డీసీఎంఎస్ గోదాంలో జీలుగు విత్తనాలను అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు

చేగుంట/పాపన్నపేట/నిజాంపేట/జిన్నారం/జహీరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే (పచ్చి రొట్ట ఎరువులు) జీలుగు విత్తనాలు రైతు సేవ ఆగ్రో కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని చేగుంట మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ఫోన్ నెంబర్ అందజేసి సబ్సిడీని పొందాలని సూచించారు. పాపన్నపేట మండలం కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్ సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో సబ్సిడీ జీలుగా విత్తనాల విక్రయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 500 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏవో నాగమాధురి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, నాయకులు సందీప్, వెంకటేశం, లింగం, ఏఈవో అభిలాష్, పాల్గొన్నారు నిజాంపేట మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో ఏవో సోమలింగారెడ్డి సోమవారం రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. సబ్సిడీ పై జీలుగ విత్తనాలను, ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డిలు రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రవీందర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ గోదాంలో సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలను ఇస్తున్నామని, తర్వాత మరిన్ని రకాల విత్తనాలను, ఎరువులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, ఏవో లావణ్య, సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా బడిబాట



తూప్రాన్‌లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న టీచర్లు

తూప్రాన్/పెద్దశంకరంపేట/నిజాంపేట/నాగల్‌గిద్ద, మే 26(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ జిల్లాలోని తూప్రాన్, పెద్దశంకరంపేట, నిజాంపేట మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని నాగల్‌గిద్ద మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. తూప్రాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశ అనంతరం ప్రధానోపాధ్యాయుడు పట్లూరి లక్ష్మణ్ ఇతర ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఐదేళ్లుదాటిన పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. పెద్దశంకరంపేటలో ఎంఈవో వెంకటేశం సూచనల మేరకు మండలంలోని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ బడి ఈడు పిల్లలందరినీ తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అన్ని సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. నిజాంపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మహేందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాల గురించి వివరించారు. పిల్లలను సర్కారుబడుల్లో చేర్చాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని ముక్టాపూర్ గ్రామంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఇంటింటికి తిరుగుతూ ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

పదోన్నతితో మరింత బాధ్యత: ఎస్పీ



ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పదోన్నతి పొందిన ఎస్ఐలు

సంగారెడ్డి క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత మరింత పెరుగుతుందని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి వచ్చిన సందర్భంగా ఎస్ఐలు సోమవారం జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించి మాట్లాడారు. ప్రజల్లో పోలీసు శాఖ పట్ల ఉన్న నమ్మకాన్ని గౌరవాన్ని మరింతగా పెంచేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో ఎస్ఐలు గంగయ్య, సుధాకర్, శ్రీహరి, సంజీవరెడ్డి, షాబుర్ రహమాన్, ఎం.లక్ష్మీనారాయణ, దుర్గయ్య, నారాయణ, వై.మల్లేశ్వర్, జి.బిక్షపతి ఉన్నారు.

డీఎస్పీ సేవలు అభినందనీయం



డీఎస్పీ రవీందర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్ దంపతులు

రామచంద్రాపురం టౌన్ మే 26 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉంటూ సేవలు చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుధారాణిలు అన్నారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురంలో బదిలీ అయిన డీఎస్పీ రవీందర్‌రెడ్డి వీడ్కోలు సభ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున తరలివచ్చి రవీందర్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, పాశమైలారం పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌యాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చిన్నశంకరంపేట/నర్సాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు పొందవచ్చని అగ్రికల్చర్ రీసర్చ్ స్టేషన్ నతన్నాయపల్లి శాస్త్రవేత్త శోభారాణి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో వర్షాకాలంలో పంటలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్‌లో ఏడీఏ సంధ్యారాణి మాట్లాడుతూ.. లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు.

● సంగారెడ్డి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటలకు తగినంత మోతాదులో ఎరువులు వాడితేనే పంటలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శాస్త్రవేత్తలు డా. విజయ్‌కుమార్, డా. పద్మజ, ఏవో ఝాన్సిలక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

(5వ పేజీ తరువాయి)

సొంత ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పడిన మండలాల్లోనూ పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ అయ్యే అవకాశం కూడా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే, ఉపాధిహామీ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు సంబంధించిన ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

వెలుగు నుంచి సెర్ప్ వరకు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం వెలుగు పేరుతో సంస్థను కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. 2002లో ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. 2004లో కాంగ్రెస్ సర్కార్ ఈ పథకాన్ని ఇందిరా కాంత్రి పథకం(ఐకేపీ)గా మార్చగా.. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే దీనిని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)గా నామకరణం చేసింది. 2002 నుంచి సెర్ప్ ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. 2023 ఏప్రిల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. అయితే, పే స్కేల్ ఇతర సౌకర్యాలు వర్తింపజేసినప్పటికీ బదిలీలు, పదోన్నతులు ఇంకా పూర్తిస్థాయిలో అమలు జరగాల్సి ఉంది.

వరి కుప్పను ఢీ కొన్న బైక్.. వ్యక్తి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వరి ధాన్యం కుప్పకు బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మేల్లూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేల్లూరు గ్రామానికి చెందిన దాసరి కిరణ్ (29) వెల్దుర్తి నుంచి తూప్రాన్ ప్రధాన రోడ్డుపై బైక్ మీద వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డుపై నిల్వ చేసిన వరి ధాన్యం కుప్పను బైక్ ఢీకొని బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

శివ్వంపేట్, మే 26(ఆంధ్రజ్యోతి): అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ బాధితమహిళ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపి వివరాల మేరకు మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన నైనిక అలియాస్ పూజకు మూడేళ్ల క్రితం పాపన్నపేట మండలం కొడపాక గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్‌తో కట్నకానుకలతో ఘనంగా పెళ్లి జరిపించారు. అయినప్పటికీ భర్త జ్ఞానేశ్వర్ తల్లిదండ్రులు, ఆడపడుచుల అండతో అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు.

పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు

రామచంద్రాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను పురస్కరించుకుని కొల్లూరు పోలీసులు అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) ఎగ్జిట్-2 వద్ద సోమవారం పికెటింగ్ నిర్వహించారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో అనుమానాస్పదంగా ఉన్న పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరానికి వివిధమార్గాల ద్వార మూగజీవుల రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

భూ లావాదేవీల్లో పారదర్శకత మెరుగే లక్ష్యం

మెదక్ అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): భూలావాదేవీల సామర్థ్యం, పారదర్శకత మెరుగే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ క్యాంపస్‌లో మొదటి విడతలో 116 మంది సర్వేయర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. శిక్షణలో ప్రతీ అంశంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో భూ కొలతల స హాయ సంచాలకులు శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో బోనాలు

పెద్దశంకరంపేట, మే 26(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంగమ్మ తల్లికి అంగరంగ వైభవంగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సాయంత్రం పేటలోని పలు పురవీధుల గుండా దుర్గాభవానీ ఆలయం వద్ద నుండి తిరుమలాపూర్ చెరువు పక్కనే ఉన్న గంగమ్మ తల్లి ఆలయానికి మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు

గుమ్మడిదల, మే (ఆంధ్రజ్యోతి):'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' అనే శీర్షికన ఈనెల 26న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గుమ్మడిదల మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ పరిధిలో గల ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

సదస్సుల్లో దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

కొండాపూర్, మే26(ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన భూ సమస్యల వివరాల దరఖాస్తుల నమోదు, పరిష్కారాలను త్వరత్వరగా పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, కొండాపూర్ మండల భూ భారతి ప్రత్యేకాధికారి దేవుజా రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. సోమవారం కొండాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులపై ఆరా తీశారు. భూసమస్యల శాశ్వత పరిష్కారమే ముఖ్య ఉద్దేశంగా పనులను వేగవంతంగా కొనసాగించాలన్నారు. గడువులోపు పైలెట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో వచ్చి దరఖాస్తులను పరిష్కరించే దిశగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ అశోక్, డీటీ మల్లేశం, రెవెన్యూ బృందాల అధికారులు, ఆర్ఐలు రాజు,రాంచందర్, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ముబారక్‌పూర్‌కు చెందిన పండరీకి రూ.37 వేలు, బొక్కస్‌గాంకు చెందిన బాల్‌రెడ్డికి రూ.21 వేలు, అంతర్గాంకు చెందిన భూలిబాయికి రూ.17 వేలు, గౌడ్‌గాంకు చెందిన సంగీతకు రూ వేలు, మునిగేపల్లికి చెందిన నాగవ్వకు రూ.22 వేలు, భానుగౌడ్‌కు రూ.18,500, ఫుల్‌కుర్తికి చెందిన విమలకు రూ.51 వేలు మంజూరు కాగా సోమవారం చెక్కులను అందజేశారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

గుమ్మడిదల, మే 26 (ఆంధ్రజ్యోతి) : బొంతపల్లి పారిశ్రామిక వాడలో కొన్ని పరిశ్రమలు వర్షం వచ్చినప్పుడు కాలుష్య రసాయన జలాలను బయటకు వదిలి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే అలాంటి పరిశ్రమల ను గుర్తించి చర్యలు తీసుకొని మూసివేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గిద్దె రాజు అందుకు కారణమైన మెట్రోకెం పరిశ్రమను మూసివేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు, మే 26(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేకు వనతిపత్రం సమర్పించారు. అంతకుముందు డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో సీసీ రోడ్లకు రూ. కోటి, సీతారామాపురం కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. త్వరలోనే నిధులు మంజూరే చేస్తామని డివిజనల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మికుల ముందస్తు అరెస్టు

తూప్రాన్/మనోహరాబాద్ మే 26(ఆంధ్రజ్యోతి): ఛలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో భవన నిర్మాణ రంగాల కార్మికులను పోలీసులు సోమవారం ముందస్తుగ అరెస్టు చేశారు. 1996 చట్టం డిమాండ్లను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు భవన నిర్మాణ రంగాల కార్మికులు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం తెల్లవారు జామున పోలీసులు తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో భవన నిర్మాణ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు.